క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ ఏర్పాటు



మెళవాయి ఎస్సీ కాలనీలో పైపులైన్ ఏర్పాటు చేస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండలంలోని మెళవాయి ఎస్సీ కాలనీ ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ రంగనాథ్ ఆదివారం తెలిపారు. తిమ్మప్ప స్వామి ఆలయం వద్ద కొత్తగా వేసిన బోరులో నీరు పుష్కలంగా పడినట్లు పేర్కొన్నారు. బోరు నుంచి కాలనీలోని కుళాయిలకు నీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ పైప్‌లైన్ ఏర్పాటుతో వేసవిలో కూడా తాగునీటికి ఇబ్బందులు ఉండవన్నారు. అదే విధంగా పంచాయతీలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

నేత్రదానంతో మరొకరికి చూపు



మృతుడి కళ్లను సేకరించిన దృశ్యం

పావగడ: తాను మరణించినా తన కళ్లను దానం చేసి, మరొకరి చూపుకు కారణమయ్యాడు మృతుడు నాగరాజు. వివరాలు.. పట్టణంలోని బాబయ్య గుడి వీధికి చెందిన నూనె వ్యాపారి నాగరాజు (61) శనివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ఒప్పుకున్నారు. మధుగిరికి చెందిన సామాజిక కార్యకర్త గాయత్రి నారాయణ్ ఆదివారం మృతుడి నేత్రాలు సేకరించి బెంగళూరులోని డాక్టర్ రాజ్‌కుమార్ నేత్రదాన కేంద్రానికి తరలించారు.

నేడు రొళ్లలో 'డివిజన్ స్థాయి స్పందన'

రొళ్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకూ డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్, డివిజన్ స్థాయి అన్ని శాఖల అధికారులు హాజరవుతారన్నారు. రొళ్ల మండలంలోని అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు కూడా తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని సూచించారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సులు



అరుణాచలం బయలుదేరుతున్న బస్సులు

హిందూపురం టౌన్: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి ఆదివారం కోటి లింగాలు, అరుణాచలానికి ప్రత్యేక బస్సులు బయలుదేరి నట్లు డిపో మేనేజర్ శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం ఉదయం కోటిలింగాలకు రెండు బస్సులు, అరుణాచలానికి ఐదు బస్సులు ప్రయాణికులతో బయలుదేరాయన్నారు. దైవ దర్శనం అనంతరం బస్సులు సోమవారం హిందూపురం చేరుతాయన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హంపన్న, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

హిందూపురం టౌన్: స్థానిక గుడ్డం రంగనాథ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అర్చకుడు గోవింద శర్మ ఆధ్వర్యంలో రంగనాథస్వామిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుదీర్చి పూజలు చేసి గిరి ప్రదక్షిణ చేపట్టారు. భక్తులు హాజరై పూజలు నిర్వహించారు.

అయోధ్యలో వాల్మీకి మందిరం నిర్మించాలి



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పావగడ: అయోధ్యలో నిర్మించిన రామ మందిరంతో పాటు రామాయణ గ్రంథకర్త మహర్షి వాల్మీకి మందిరాన్ని సైతం నిర్మించాలని స్థానిక వాల్మీకి జాగృతి వేదిక అధ్యక్షుడు పాశేగార్ లోకేశ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాలూకాలోని వీర్లగొంది గ్రామంలో ఆదివారం వాల్మీకి జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. రామాయణ గ్రంథం ద్వారా ధర్మమూర్తి రామ చంద్రుడిని విశ్వానికి పరిచయం చేసి రామ రాజ్య పరికల్పనకు శ్రీకారం చుట్టిన వాల్మీకి మందిరాన్ని నిర్మించాలన్నారు. అనంతరం వాల్మీకి చిత్రపటాన్ని గ్రామంలో ఘనంగా ఊరేగించారు. మహిళలు జ్యోతులు మోశారు.

భారత రాజ్యాంగం ఆదర్శం

• ఎమ్మెల్యేలు తిప్పేస్వామి, శంకరనారాయణ



పెనుకొండలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ



మడకశిరలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర/మడకశిరరూరల్/పావగడ/అమరాపురం: రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ కాపాడాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, మండల ప్రజాపరిషత్ కారాలయంలో ఆదివారం రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్టకామప్ప, జేసీఎస్ కన్వీనర్ విక్రమ్,ఎంపీపీ కవిత,మాజీ ఎంపీపీ బజ్జప్ప, ఎంపీడీఓ సోనిబాయి, యూటీఎఫ్ నాయకులు భూతన్న, మాలింగప్ప, మూడ్ల గిరియప్ప, జోగప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే మడకశిర మండల పరిధిలోని జిల్లెడుగుంట ఎంపీయూపీఎస్ పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. పావగడలో తహసీల్దార్ వరదరాజు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఓమారప్ప ఆధ్వర్యంలో టోల్ గేట్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. అమరాపురం ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీపీ ఈరన్న, ఎంపీడీఓ మునిస్వామి తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. రొళ్లలో అంబేడ్కర్ రచించిన పీఠికను చదివి వినిపించారు. ఈఓఆర్డీ క్రిష్టప్ప, బీజీ హళ్లి సర్పంచ్ సదాశివప్ప, ఏపీఓ ఓబుళప్ప పాల్గొన్నారు.

హిందూపురం టౌన్/అర్బన్: ప్రపంచ దేశాలకు భారతదేశ రాజ్యాంగం ఆదర్శంగా నిలిచిందని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో భారత రాజ్యాంగ వ్యవస్థాపక దినోత్సవాన్ని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను పాటిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, పట్టణ బీబ్లాక్ కన్వీనర్ వాటర్ నరేష్, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్, రామచంద్ర, మల్లికార్జున, రోషన్ అలీ, గిరి, మణి, మల్లికార్జున గౌడ్, నాగేంద్రబాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక చిన్నమార్కెట్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మురళీ మోహన్ అధ్యక్షతన భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా కొట్నూరు జెడ్పీహెచ్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. ఎస్‌డీజీఎస్ కళాశాలలో ఎన్‌సీసీ డే, రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చిన్నమార్కెట్, సూగూరు వద్ద అంబేడ్కర్ చిత్రపటం, విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తూమకుంట గ్రామ సచివాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు

లేపాక్షి: మండలంలోని కొండూరు, చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సుధామణి, శేషగిరిబాబు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో భారత రాజ్యాంగ దినోత్సం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి మల్లికార్జున, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో భారత రాజ్యాంగా దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్, సిబ్బంది పాల్గొన్నారు.



పెనుకొండలో పూలమాల వేస్తున్న రాష్ట్ర వాల్మీకి బోయ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర



పావగడలో ప్రతిజ్ఞ చేస్తున్న దళిత సంఘం నాయకులు



హిందూపురంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



హిందూపురంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు

పెనుకొండ రూరల్: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనది అన్నారు. దేశం మొత్తాన్ని ఒకే తాటిపై నడిపించే గొప్ప రాజ్యాంగం..భారత రాజ్యాంగమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలో రాజ్యాంగ దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. స్థానిక అంబేడ్కర్ సర్కిల్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్ర వాల్మీకి, బోయ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర మాట్లాడారు. బహుజన చైతన్య వేదిక, ఆల్ కౌసర్ సేవా సంస్థ, న్యాయవాది రామకృష్ణ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు.

పరిగి: మండలంలో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దారు కార్యాలయంలో అంబేడ్కర్, రాజ్యాంగ పీఠిక చిత్రపటాలకు తహసీల్దారు సౌజన్యలక్ష్మి పూలమాలలు వేశారు. కార్యక్రమాలలో డీటీ లక్ష్మీనరసింహ, సీనియర్ అసిస్టెంట్ మురళీ, ఆర్ఐ సిద్ధేశ్వర్, కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు. పరిగి వైఎస్సార్ సర్కిల్, కొడిగెనహళ్లి పంచాయతీ కార్యాలయం వద్ద రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



మడకశిర పట్టణంలో నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే తిప్పేస్వామి



మడకశిర మండలం టీడీపల్లిలో బుక్‌లెట్ అందిస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీలోని వైఎస్సార్‌సీపీ నాయకులు వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి కోరారు. ఆదివారం మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పుట్టకామప్ప అధ్యక్షత వహించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం అనుసరించాల్సిన వ్యూహంపై నాయకులతో ఎమ్మెల్యే చర్చించారు. వచ్చే ఎన్నికల్లో మడకశిరలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలన్నారు. ఇప్పటి నుంచే కలిసికట్టుగా పని చేయాలని కోరారు. నాయకులందరూ ఏకతాటిపై ఉండి పని చేయాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. 20 వార్డుల పరిధిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు లక్ష్మీనరసింహారెడ్డి, రాజేష్, ఎస్ఎన్ కృష్ణమూర్తి, అంజన్, అంజలి, అక్రమ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండల పరిధిలోని తిరుమలదేవరపల్లి, ఆమిదాలగొంది గ్రామాల్లో ఆదివారం వై ఏపీ నీడ్స్ జగన్ (ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఎందుకు కావాలి) కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా వెళ్లి సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందించారు. మరోసారి వైఎస్ జగన్‌కు అండగా నిలిచి సీఎంగా చేసుకోవాలని తెలిపారు. ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందించి రూ.లక్షల్లో లబ్ధి చేకూర్చిన వైఎస్ జగన్‌ను సీఎంగా చేసుకుంటామని ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగనాథ్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సజావుగా ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మడకశిర: నియోజకవర్గంలోని 5 మండలాల పరిధిలో ఆదివారం ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) మోడల్ పరీక్ష సజావుగా ముగిసింది. స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఆయా మండలాల్లోని ఉన్నత పాఠశాలల్లో జరిగిన ఈ పరీక్షకు 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, స్థానిక నాయకులు దత్తాత్రేయ, వేదాచలం, నాగేంద్ర, లక్ష్మణమూర్తి, శోభ, కరియన్న, దేవరాజు, రవీంద్ర, రంగయ్య, ఉమాశంకర్, జబీర్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్) మోడల్ పరీక్ష జరిగింది. 65 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వరదరాజు, దాసేగౌడ్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పురం'లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, నాయకులు

హిందూపురం టౌన్: ఎన్నికల యుద్ధానికి తాము సిద్ధంగా ఉన్నామని, హిందూపురంలో వైస్సార్‌సీపీ భారీ విజయం సాధిస్తుందని, బాలకృష్ణ ఓడిపోవడం ఖాయమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ టీ.ఎన్.దీపికపై టీడీపీ నాయకులు చేసిన ఆరోపణలుపై వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఘాటుగా స్పందించారు. వైస్ చైర్మన్లు బలరామిరెడ్డి, జబీవుల్లా, పట్టణ బీ బ్లాక్ కన్వీనర్ నరేష్, కౌన్సిలర్లు శివ, ఆసీఫ్‌తో కలసి ఆమె మాట్లాడారు. హిందూపురం అభివృద్ధిపై చర్చకు సిద్ధంగా ఉన్నామని టీడీపీ నేతలకు సవాల్ విసిరారు. 40 ఏళ్లుగా హిందూపురానికి టీడీపీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహించినా ఏ మాత్రం అభివృద్ధి చేయలేదన్నారు. అయితే నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో హిందూపురం పట్టణంలో అర్హులైన పేదలకు సంక్షేమ పథకాల ద్వారా రూ.702 కోట్లు అందించామన్నారు. అలాగే నియోజకవర్గంలో రూ. 1500 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా నేరుగా ప్రజల ఖాతాల్లో వేశామన్నారు. రూ.40 కోట్లతో పట్టణంలోని 38 వార్డుల్లో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఇప్పటికే రూ.15కోట్ల వరకూ పనులు పూర్తి అయ్యాయన్నారు. రూ.650 కోట్లతో పీఏబీఆర్ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాన్ని తీసుకువచ్చి హిందూపురంతో పాటు పారిశ్రామికవాడకు నీరందించిన ఘనత దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డికి దక్కుతుందన్నారు. పీఏబీఆర్‌ను పక్కకు పెట్టి రూ.194 కోట్లతో బాలకృష్ణ గొల్లపల్లి నుంచి ప్రత్యేక పైప్ లైన్ వేయించారని, ఇందులో కోట్ల రూపాయలు కమిషన్ల రూపంలో టీడీపీ నొక్కేసిందన్నారు. అలాగే రూ.114 కోట్లు మున్సిపాలిటీపై భారం మోపారన్నారు. పట్టణంలోని 38 వార్డుల్లోనూ రూ.20కోట్ల వరకూ సంక్షేమం, అభివృద్ధికి ఖర్చు చేశామన్నారు. పోచనపల్లి వద్ద రూ.80లక్షలతో బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమవుతోందని, కిరికెర వద్ద పెన్నా నదిపై బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాన్నారు.

అవినీతికి కేరాఫ్ టీడీపీ

ఎమ్మెల్యే బాలకృష్ణ, టీడీపీ నాయకులు అవినీతికి కేరాఫ్ అడ్రస్ అన్నారు. వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్‌గా దీపిక నియమింపబడి నాలుగు నెలలు కాకమునుపే దౌర్జన్యాలు, భూ కబ్జాలు చేస్తున్నారని టీడీపీ నేతలు ఆరోపించడం సిగ్గు చేటన్నారు. గత టీడీపీ హయాంలో పీఏ శేఖర్, ఇతరుల ముసుగులో ఎమ్మెల్యే బాలకృష్ణ అవినీతికి పాల్పడ్డారని, గొల్లపల్లి నుంచి పైప్‌లైన్, మాతాశిశు ఆసుపత్రి, రహదారి పనుల్లో కమీషన్లు దండుకున్నారన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ అనిల్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ భర్త గ్రీన్ పార్క్ నాగరాజు వారి హయాంలో తీవ్రస్థాయిలో భూకబ్జాలకు పాల్పడ్డారన్నారు. అసత్య ఆరోపణలు మానుకోకపోతే టీడీపీ నాయకులకు ప్రజలే బుద్ధి చెప్తారన్నారు. కార్యక్రమంలో బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు రామచంద్ర, నాగేంద్రబాబు, మల్లికార్జున, మణి, నాయకులు మహేష్, నాగరాజు, నాగమణి, శ్రీకాంత్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



హిందూపురం గుడ్డం శివాలయంలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు



చిలమత్తూరు కొడికొండ శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో కార్తీక దీపోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.



మడకశిరరూరల్: అలంకరణలో జిల్లేడుగుట్ట ఆంజనేయస్వామి



చిలమత్తూరు: అలంకరణలో చౌడేశ్వరీదేవి



అమరాపురం: హేమావతిలో అలంకరణలో స్వామి

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

గోరంట్ల: మండలంలోని ఎం. కొత్తపల్లి సమీపంలో హిందూపురం – గోరంట్ల ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. గోరంట్ల పట్టణానికి చెందిన మేహరాజ్ అనే యువకుడు హిందూపురం వైపు నుంచి ద్విచక్రవాహనంపై గోరంట్లకు వెళ్తుండగా, గువ్వలగుట్టపల్లికి చెందిన మహేష్ అనే యువకుడు గోరంట్ల వైపు నుంచి పాలసముద్రం వైపు ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. ఎం. కొత్తపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడిన యువకులను 108 వాహనంలో గోరంట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మహేష్ అనే యువకుడిని మెరుగైన చికిత్స కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

రేపు హొట్టేబెట్టలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

రొళ్ల: మండల పరిధిలోని హొట్టేబెట్ట సచివాలయ ఆవరణలో మంగళవారం ఉదయం 11 గంటలకు 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగేంద్ర ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తిప్పేస్వామి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తారన్నారు. జెడ్పీటీసీ, అన్ని పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, మండల, గ్రామ స్థాయి అధికారులు వలంటీర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శుభకార్యం

పరిగి: మండలంలోని శ్రీరంగరాజుపల్లి పంచాయతీ వైస్ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి నూతనంగా నిర్మించుకున్న గృహ ప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పాల్గొన్నారు. పంచాయతీ పరిధిలోని పాపిరెడ్డిపల్లిలో ఆదివారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, ఆయన సోదరుడు మాలగుండ్ల రవీంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన



మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ రమణయ్య

పెనుకొండ రూరల్: మండలంలోని మునిమడుగులో వికసిత్ సంకల్ప్ యాత్రపై ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌బీఐ మేనేజర్ రమణయ్య, ఏపీఎం నాగేంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం వడ్డీలేని రుణాలు, తక్కువ వడ్డీకి విడిగా రుణాలు మంజూరు చేస్తోందన్నారు. ఎంపీడీవో శివశంకరప్ప, సర్పంచ్ నాగమూర్తి, అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: హెచ్ఐవీ ప్రమాదకరమని వక్తలు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఎయిడ్స్ నియంత్రణ విభాగం, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో ఆదివారం పరిగిలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక 90 ఇండ్ల కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ లింగమ్మ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో యానిమేటర్ రామాంజి, అంగన్‌వాడీ కార్యకర్త ఆదిలక్ష్మి, లింక్ వర్కర్ బషీరూన్, సరిత పాల్గొన్నారు.

ఐచర్ వాహనం బోల్తా

చిలమత్తూరు: మండలంలోని 44 వ నెంబరు జాతీయ రహదారి కమ్మయ్యగారిపల్లి క్రాస్ వద్ద ఐచర్ వాహనం బోల్తా పడింది. వివరాలు.. ఆదివారం ఉదయం రాయచోటి నుంచి దొడ్డబళ్లాపురానికి బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ వాహనం కమ్మయ్యగారి క్రాస్‌కు రాగానే వెనుకవైపు చక్రం ఊడిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ వాహనంలోనే ఇరుక్కుపోగా స్థానికులు బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

హిందూపురం: సెల్ పాయింట్ అసోసియేసన్ సభ్యుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి అన్నారు. పట్టణంలోని సెల్ పాయింట్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా సెల్ పాయింట్ అసోసియేషన్ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. వేణురెడ్డి స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆసీఫ్, సెల్ పాయింట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇబ్రహీం, వసీం, సల్మాన్, బాబా, ముసవీర్, చంద్ర, వెంకట్, మోహన్ రాజ్, జబీ, బాలు, జీవన్, నరేష్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.